సాక్షి
మంచిర్యాల
మంగళవారం । 24 । సెప్టెంబర్ । 2024



బడులకు నిధులొచ్చినయ్
ప్రభుత్వ పాఠశాలల నిర్వహణకు సంబంధించి తొలి విడత నిధులు విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రత్యేకంగా క్రీడా నిధులు కూడా ఖాతాల్లో జమ చేసింది. 8లో▸



లేబర్‌కోడ్‌లు రద్దు చేయాలి
కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన లేబర్‌కోడ్‌లను వెంటనే రద్దు చేసి కార్మికుల హక్కులు కాపాడాలని సీఐటీయూ డిమాండ్ చేసింది. పలు మండలాల్లో రాస్తారోకో చేశారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
33.0 /26.0

వాతావరణం
ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. ఈశాన్యం దిశగా ఈదురు గాలులు బలంగా వీస్తాయి. ఉష్ణోగ్రతలు తగ్గుతాయి.

న్యూస్‌రీల్

29న పీఎల్ఆర్ బోనస్‌పై సమావేశం

శ్రీరాంపూర్: బొగ్గు గని కార్మికులకు ప్రతీ దీపావళికి చెల్లించే ప్రాఫిట్ లింక్డ్ రివార్డు(పీఎల్ఆర్)పై ఈ నెల 29న సమావేశం జరగనుందని బీఎంఎస్ కేంద్ర అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఢిల్లీలోని కోలిండియా కార్యాలయంలో జరిగే ఈ సమావేశానికి బీఎంఎస్ నుంచి జేబీసీసీఐ సభ్యుడు కే.లక్ష్మారెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు. గత సంవత్సరం రూ.85 వేలు బోనస్ ఇప్పించామని, ఈసారి బోనస్ పెరిగేందుకు తమ యూనియన్ నాయకులు కృషి చేస్తున్నారని తెలిపారు.

మున్సిపల్ ఎన్నికలపై హైకోర్టును ఆశ్రయించిన జేఏసీ

మందమర్రిరూరల్: గత 30ఏళ్ల క్రితం ఏర్పడిన మందమర్రి మున్సిపాల్టీకి ఎన్నికలు నిర్వహించాలని మున్సిపల్ ఎన్నికల సాధన జేఏసీ ఆధ్వర్యంలో హైకోర్టును ఆశ్రయించారు. పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు రెండు వారాల్లో వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించినట్లు జేఏసీ సభ్యులు తెలిపారు. 30ఏళ్ల క్రితం గ్రామ పంచాయతీగా ఉన్న మందమర్రిని మున్సిపాల్టీ చేయగా.. చట్టబద్ధత లేకపోవడంతో తిరిగి పంచాయతీగా చేస్తూ ఎన్నికలు నిర్వహించుకునే విధంగా జేఏసీ తరఫున అడ్వకేట్ రవీందర్‌రెడ్డి వాదనలు వినిపించగా.. చీఫ్ జస్టిస్ అలోక్ రాధే, జస్టిస్ జే.శ్రీనివాస్‌రావుతో కూడిన ధర్మాసనం రెండు వారాల్లో వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వానికి గడువు విధించిందని పేర్కొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని నిరసన


నిరసన కార్యక్రమంలో మల్టీపర్పస్ కార్మికులు

మంచిర్యాలఅగ్రికల్చర్: సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గ్రామ పంచాయతీ కారోబార్, బిల్ కలెక్టర్, పంప్ ఆపరేటర్, ఎలక్ట్రీషియన్, మల్టీపర్పస్ వర్కర్స్ సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం డీపీవో వెంకటేశ్వర్‌రావు, కలెక్టరేట్ ఏవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మల్టీపర్పస్ వర్కర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చాతరాజుల మురళీధర్, ఇప్ప వెంకటేష్, గొల్లపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ కొన్నేళ్లుగా చాలీచాలని వేతనాలతో గ్రామాల్లో పని చేస్తున్నామని, పెండింగ్ వేతనాలు చెల్లించాలని అన్నారు. ప్రతీ ఒక్కరికి పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని పేర్కొన్నారు.

ఆకులు తింటూ నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

లక్సెట్టిపేట: మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ వేతనాలు, బిల్లులు వెంటనే చెల్లించాలని సీఐటీయూ నాయకుల ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందని ఆకులు తింటూ నిరసన తెలిపారు. బిల్లులు సకాలంలో చెల్లించకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పండుగ వస్తుందని, పస్తులు ఉండే పరిస్థితి ఏర్పడుతోందని పేర్కొన్నారు. అనంతరం ఎంపీవో శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు దుంపల రంజిత్, కార్మికులు రజిత, కాంతవ్వ, సత్తమ్మ, పోసవ్వ పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ


మొక్క నాటుతున్న ఈడీ రాజశేఖర్‌రావు

జైపూర్: మొక్కల పెంపకంతోనే పర్యావరణాన్ని రక్షించుకోగలమని, ప్రతి ఒక్కరూ బాధ్యతతో మొక్కలు నాటి సంరక్షించాలని ఎస్టీపీపీ ఈడీ రాజశేఖర్‌రావు, కార్పొరేట్ ప్లానింగ్ అండ్ ప్రాజెక్టు జీఎం రమేశ్ తెలిపారు. మండల కేంద్రంలోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటులో సోమవారం స్వచ్ఛత స్పెషల్ క్యాంపెయిన్ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యత దెబ్బతినడం వల్ల అనేక ఇబ్బందులు తలెత్తుతాయని అన్నారు. అధికారులు శ్రీనివాసులు, జెన్‌సింగ్, సముద్రాల శ్రీనివాస్, సుధాకర్, మోహన్, చంద్రమణి, అజ్మీక తుకారం, ప్రభాకర్‌రావు, అఖిల్‌కపూర్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ గోస తీరేనా!


సాయంత్రం వేళ మార్కెట్‌లో రద్దీ

- జిల్లా కేంద్రం మార్కెట్‌లో ఇబ్బందులు
- రోడ్లపై ఉన్న ఆక్రమణలపై దృష్టి
- కలెక్టర్, ఎమ్మెల్యే చొరవతో ముందుకు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: జిల్లా కేంద్రం మంచిర్యాలలోని ప్రధాన రోడ్లు, మార్కెట్ ఏరియాలో రద్దీ వేళల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సరైన పార్కింగ్ సౌకర్యం లేక రోడ్లపైనే వాహనాలు నిలిపి వెళ్తున్నారు. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. పెరుగుతున్న జనాభా, పట్టణీకరణకు అనుగుణంగా సౌకర్యాలు కల్పించకపోవడం, గత కొన్నేళ్లుగా పట్టణీకరణ క్రమ పద్ధతిలో లేకపోవడం వల్ల ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయి. సాయంత్రం, రద్దీ వేళల్లో మార్కెట్‌లో మోటార్‌సైకిళ్లు, ఆటోలు ట్రాఫిక్‌లో చిక్కుకుంటున్నాయి. ఇష్టారీతిన రాకపోకలు సాగిస్తుండడంతో ట్రాఫిక్ గందరగోళంగా మారుతోంది. గత కొంతకాలంగా ట్రాఫిక్ నియంత్రణ కోసం పోలీసులు శ్రమిస్తున్నా పార్కింగ్ స్థలం లేకపోవడంతో ఇష్టారీతిన రోడ్లపైనే నిలపాల్సి వస్తోంది. మరోవైపు కమర్షియల్ కాంప్లెక్స్‌లు, బహుళ అంతస్తుల భవనాలకు సైతం పార్కింగ్ స్థలం కేటాయించడం లేదు. సెల్లార్లను సైతం భవన యజమానులు అద్దెకు ఇస్తున్నారు. దీంతో ఎక్కడికక్కడ ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. మంచిర్యాల పట్టణంలో సెల్లార్లలోనూ దుకాణాలు నిర్వహిస్తున్న 91 భవన నిర్మాణదారులకు నోటీసులు ఇచ్చారు. వారిపై కఠిన చర్యలు తీసుకోవడంలో అధికారులు వెనుకడుగు వేస్తున్నారు. తాజాగా రెండ్రోజుల క్రితం కలెక్టర్, ఎమ్మెల్యే, ఏసీపీ, సీఐ, ట్రాఫిక్ పోలీసులు, మున్సిపల్ కమిషనర్, ఇతర అధికారులు మార్కెట్‌లో పర్యటించారు. రోడ్లపై ఆక్రమణలు తొలగించేలా కార్యాచరణ సిద్ధం చేశారు.

నరకమే..

మంచిర్యాల పట్టణంలో రాకపోకలు సాగించాలంటే నిత్యం నరకంగా మారింది. ఐబీ చౌరస్తా, వేంకటేశ్వర చౌరస్తా, బెల్లంపల్లి చౌరస్తా, లక్ష్మిటాకీస్ చౌరస్తా వరకు ప్రధాన రోడ్డుకు ఇరువైపుల వ్యాపార, వాణిజ్య సముదాయాలు ఉన్నాయి. ఇక బస్టాండ్, రైల్వేస్టేషన్, కూరగాయల మార్కెట్, గంగారెడ్డి రోడ్డు, ముఖరాం చౌరస్తా, మున్సిపల్ కార్యాలయం వైపు, వేంకటేశ్వర థియేటర్, అర్చన్ టెక్స్ చౌరస్తా వద్ద నిత్యం రద్దీగానే ఉంటోంది. ఉదయం, మధ్యాహ్నం వరకు కొంత రాకపోకలకు ఇబ్బంది లేకున్నా, సాయంత్రం వేళ, పండుగలు, సెలవులు, ప్రత్యేక దినాల్లో మరింత రద్దీగా ఉంటోంది. ఇరుకు గల్లీల్లోనూ వ్యాపారాలు సాగుతున్నాయి. దుకాణాల ప్రారంభోత్సవాలు, ఆఫర్లు ప్రకటించిన రోజుల్లో ట్రాఫిక్ మరింత కష్టంగా మారుతోంది. వ్యాపారులు పార్కింగ్ స్థలం కేటాయించాలని మున్సిపాలిటీకి వినతులు ఇస్తున్నారు. జిల్లా కేంద్రంలో 1.50లక్షలకు పైగా జనాభా ఉండగా, 60వేల వాహనాలు ఉన్నట్లు అంచనా. వీటికి అదనంగా 20నుంచి 30వేల వరకు జిల్లాతోపాటు పొరుగు జిల్లాలు, మహారాష్ట్ర నుంచి నుంచి ప్రజలు వివిధ అవసరాల కోసం మంచిర్యాలకు వస్తుంటారు. ఈ మేరకు రద్దీకి తగినట్లుగా సదుపాయాలు లేక అవస్థలు తప్పడం లేదు.

ఆక్రమణలను తొలగిస్తేనే..

మార్కెట్ ఏరియాలో గత కొన్నేళ్లుగా కొందరు రోడ్డునే ఆక్రమణలు చేపట్టి వ్యాపారాలు సాగిస్తున్నారు. చిరు వ్యాపారులు, కూరగాయల వ్యాపారులు మున్సిపల్ కార్యాలయం, ప్రధాన రోడ్డుపైనే దుకాణాలు నిర్వహిస్తున్నారు. కొందరు అక్రమంగా టేలాలు ఏర్పాటు చేసుకున్నారు. ఇక సెల్లార్లతోపాటు భవనం ముందున్న రోడ్డు జాగాలను చిరు వ్యాపారులకు అద్దెకు ఇస్తూ రూ.వేలల్లో వసూళ్లు చేస్తున్నారు. దీంతో ప్రధాన దుకాణాలతోపాటు ముందుండే చిన్న టేలాలతోనూ ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. ఈ క్రమంలో పట్టణంలో ట్రాఫిక్ ఇక్కట్లతో ఎదురవుతున్న సమస్యతో కలెక్టర్ కుమార్ దీపక్, స్థానిక ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావు, ఏసీపీ ప్రకాశ్, సీఐ, ట్రాఫిక్ పోలీసులు, స్థానిక మున్సిపల్ అధికారుల సమన్వయంతో ఆక్రమణలకు తొలగించేందుకు ఏర్పాట్లు చేశారు. తోపుడుబండ్లతోపాటు అక్రమంగా ఏర్పాటు చేసిన టేలాలు తొలగించేందుకు రంగం సిద్ధం చేశారు. మార్కెట్‌లో వాటర్ ట్యాంక్ కూల్చివేశాక అక్కడ టేలాల ఏర్పాటు, తోపుడు బండ్లను క్రమపద్ధతిలో ఉండేలా ఏర్పాటు చేయడంతో రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలు తొలగిస్తేనే ప్రజలందరికీ సౌకర్యంగా ఉండనుంది.

అర్జీలు సత్వరమే పరిష్కరించాలి

- పెండింగ్‌లో ఉంచొద్దు
- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్


ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాలఅగ్రికల్చర్: ప్రజావాణిలో వచ్చిన అర్జీలు పెండింగ్‌లో ఉంచకూడదని, సమస్యలు పూర్తి స్థాయిలో పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం సమీకృత కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, మంచిర్యాల, బెల్లంపల్లి ఆర్డీవోలు రాములు, హరికృష్ణలతో కలిసి అర్జీలు స్వీకరించారు. భూ సమస్యలు, పింఛన్, భూ పరిహారం, వేతనాలు రావడం లేదని, తదితర సమస్యలపై దరఖాస్తులు సమర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాదర్బార్‌లో వచ్చిన అర్జీలు, జిల్లా ప్రజావాణికి వచ్చిన అర్జీలు ఆయా శాఖల అధికారులు పూర్తి స్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని సూచించారు.

అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలి



మందమర్రి మండలం తిమ్మపూర్ శివారు లోని సర్వే నంబర్ 89లో మా తల్లి దుర్గం లక్ష్మి 1992లో 8 గుంటల భూమిని కొనుగోలు చేసి 1787/92 ప్రకారం రిజిస్ట్రేషన్ చేయించుకొని ఇప్పటి వరకు భూమి మోకాపై ఉన్నాం. కానీ కొంతమంది వ్యక్తులు అక్రమంగా పట్టా చేసుకున్నారు. వారిపై చర్యలు తీసుకోవాలి.
– దుర్గం నర్సయ్య, గ్రామం: తిమ్మపూర్, మం: మందమర్రి

కూతురు, అల్లుడు చూడడం లేదు..


లక్ష్మిని వృద్ధాశ్రమంలో చేర్పిస్తున్న అధికారులు

మంచిర్యాలటౌన్: అనారోగ్యం, వృద్ధాప్యంతో బాధపడుతున్న తనను కూతురు, అల్లుడు చూడడం లేదని మందమర్రికి చెందిన రుద్రారపు లక్ష్మి(70) కలెక్టర్ కుమార్ దీపక్‌కు సోమవారం కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేసింది. లక్ష్మికి ముగ్గురు కూతుళ్లు కాగా, భర్త పోశం సింగరేణి రిటైర్డ్ కార్మికుడి విరమణ పొంది చనిపోయాడు. ముగ్గురు కూతుళ్లకు పెళ్లిళ్లు చేయగా.. భర్త సింగరేణి ఉద్యోగాన్ని చిన్న కూతురు మరియమ్మ భర్త జాన్‌కి ఇచ్చారు. లక్ష్మి బాధ్యతలు వారే చూస్తున్నారు. కొన్ని నెలలుగా సరిగా చూసుకోకపోవడం, ఆరోగ్యం బాగా లేకపోయినా ఆసుపత్రిలో చూపించకపోవడం, తరచూ తిట్టడంతో కలెక్టర్‌కు కలిసి తన గోడు వెల్లబోసుకుంది. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా మహిళా, శిశు, దివ్యాంగ, వృద్ధుల సంక్షేమ శాఖ అధికారులు ఎండీ.ఫర్జానా బేగం, రవికాంత్, సఖి ఇంచార్జి శ్రీలత శ్రీసాయి వృద్ధాశ్రమంలో చేర్పించారు.

అక్రమ నిర్మాణాలపై చట్ట పరిధిలోనే చర్యలు

- రాజకీయాలకు అతీతంగా అభివృద్ధిపై దృష్టి
- ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు

మంచిర్యాలక్రైం: ప్రభుత్వ భూముల కబ్జా, అక్రమ నిర్మాణాలపై చట్టపరిధిలోనే చర్యలు తీసుకుంటామని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అన్నారు. ఇటీవల నస్పూర్‌లో టీబీజీకేఎస్ నాయకుడు దీకొండ అన్నయ్య అక్రమ భవనాన్ని మున్సిపల్ అధికారులు కూల్చివేయడాన్ని మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు తప్పుపట్టడం హాస్యాస్పదంగా ఉందన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ భూమిలో భవన నిర్మాణంపై బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడే తహసీల్దార్ జ్యోతి నోటీసులు జారీ చేశారని, అప్పుడు మాజీ ఎమ్మెల్యే ఎందుకు స్పందించలేదో సమాధానం చెప్పాలని అన్నారు. రాజకీయాలకు అతీతంగా నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి సారించామని తెలిపారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో దాడులు, భూకబ్జాలు, అక్రమ కట్టడాలను ప్రోత్సహించిందని విమర్శించారు. కమీషన్లకు కక్కుర్తిపడి ఎంసీహెచ్ నిర్మించారని, ప్రతీ ఏడాది వరద ముంపునకు గురవుతోందని తెలిపారు. ఐబీ చౌరస్తాలో మాతాశిశు కేంద్రం నిర్మాణానికి అనుమతి వచ్చిందని, మాతాశిశు కేంద్రం, కరకట్టకు నిధులు మంజూరయ్యాయని, దసరా, దీపావళి మధ్యలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా పనులు ప్రారంభిస్తామని తెలిపారు. బీఆర్ఎస్, బీజేపీ నాయకులు బేర సత్యనారాయణ, హరికృష్ణ, ముత్తె సత్తయ్య, దండేపల్లిలో హరినాయక్ భూ ఆక్రమణలకు పాల్పడ్డారని ఆరోపించారు. జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి కఠిన నిర్ణయాలు తీసుకోక తప్పడం లేదని పేర్కొన్నారు.

కుమ్మరికుంట సర్వేపై ఉత్కంఠ

- భారీగా తరలివచ్చిన ప్రజలు
- నేడూ సర్వే కొనసాగింపు


కుమ్మరికుంట సర్వే చేస్తున్న అధికారులు

చెన్నూర్: చెన్నూర్ కుమ్మరికుంట చెరువు హద్దుల నిర్ధారణకు సోమవారం నీటిపారుదల శాఖ డీఈ వేణుగోపాల్, ఏఈ తిరుపతి, రెవెన్యూ మండల సర్వేయర్ అశోక్, ఆర్ఐ రంజిత్ సంయుక్త సర్వే నిర్వహించారు. ఈ సర్వేలో ఏం తేలుతుందని ప్రజలు ఉత్కంఠగా ఎదురుచూశారు. సర్వే ప్రాంతానికి పెద్దయెత్తున జనం తరలిరావడంతో ఎస్సై శ్వేత భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలీసు బందోబస్తు మధ్య అధికారులు సర్వే నిర్వహించారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం సర్వే నంబరు 971లో చెరువు శిఖం 16.24ఎకరాలు ఉంది. ఆక్రమణకు గురైందా అనే విషయాన్ని నిర్ధారించేందుకు కుమ్మరికుంట సమీప నివాస గృహాలకు అధికారులు ముందుగానే నోటీసులు జారీ చేసి సర్వే చేపట్టారు. మంగళవారం కూడా సర్వే కొనసాగుతుందని రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు తెలిపారు. బఫర్‌జోన్, ఎఫ్‌టీఎల్ జోన్ పరిధిలో ఉమ్మడి సర్వే నిర్వహిస్తున్నారని, ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ కుమార్‌దీపక్ ఒక ప్రకటనలో

చెరువు విస్తీర్ణంపై..

దండేపల్లి: మండలంలోని అల్లీపూర్ గ్రామ చెరువు విస్తీర్ణంపై కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా సర్వేయర్ శ్రీనివాస్ మండల రెవెన్యూ, మైనర్ ఇరిగేషన్ సిబ్బందితో కలిసి సోమవారం సర్వే చేశా రు. చెరువు భూమి కబ్జాకు గురవుతోందని గతంలో గ్రామస్తులు తహసీల్దార్, కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో జిల్లా సర్వేయర్ చెరువు విస్తీర్ణంతోపాటు చుట్టుపక్కల పొలాలు, హద్దులు పరిశీలించారు. జిల్లా సర్వేయర్ మాట్లాడుతూ అల్లీపూర్ గ్రామ చెరువు విస్తీర్ణం 59.33 ఎకరాలు ఉందని, మూడు రోజుల్లో సర్వే పూర్తి చేసి కలెక్టర్‌కు నివేదిక అందజేస్తామని పేర్కొన్నారు. భూమి కబ్జాకు గురైందా లేదా అనేది సర్వే పూర్తయితేనే చెప్పగలమని అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సంధ్యారాణి, మైనర్ ఇరిగేషన్ ఏఈ విజయ్‌భాస్కర్ పాల్గొన్నారు.


సర్వే చేస్తున్న జిల్లా సర్వేయర్ శ్రీనివాస్

ఊర చెరువు ఆక్రమణదారులకు నోటీసులు


భీమారంలో నోటీసులు అందజేస్తున్న సిబ్బంది

భీమారం: భీమారం ఊరచెరువును ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారని, కట్టడాలను తొలగించాలని 70మందికి సోమవారం రెవెన్యూ శాఖ అధికారులు నోటీసులు జారీ చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఊరచెరువు, ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ హద్దులు గుర్తించినట్లు తహసీల్దార్ సదానందం తెలిపారు. చెరువు భూమిని కాపాడాలని గ్రామస్తులు ఫిర్యాదు చేయగా.. రెవెన్యూ, ఇరిగేషన్ శాఖలు సంయుక్తంగా వారం రోజులపాటు ప్రభుత్వం వద్ద ఉన్న ఆధారాల ప్రకారం సర్వే చేసినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేస్తున్నామని, వెంటనే కట్టడాలను తొలగించాలని ఆదేశించారు.

పట్టాదారులకు నోటీసులు జారీ

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధి ఇటిక్యాల చెరువులో ఆక్రమణకు గురైన ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలోని పట్టాదారులకు నోటీసులు జారీ చేస్తున్నట్లు ఇరిగేషన్ డీఈ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. చెరువు భూమిని కొందరు కబ్జా చేశారని, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లను నిర్ధారించేందుకు రెవెన్యూ అధికారుల ద్వారా నోటీసులు అందజేస్తున్నట్లు తెలిపారు.

ఆగేది లేదు.. ఆపేది లేదు..!

- బెల్లంపల్లిలో యథేచ్ఛగా భూముల ఆక్రమణ
- రాత్రికి రాత్రే ఇళ్ల నిర్మాణం
- విద్యుత్ కనెక్షన్ జారీ


కన్నాల డబుల్ బెడ్రూం ఇళ్ల ముందు ప్రభుత్వ భూమిని కబ్జా చేసి రాత్రికి రాత్రే నిర్మించిన షెడ్డు

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాల్టీలో ప్రభుత్వ భూముల ఆక్రమణ యథేచ్ఛగా సాగుతోంది. రాత్రికి రాత్రే ఇళ్ల నిర్మాణాలు చేపడుతుండగా.. అంతేవేగంగా మున్సిపల్ కార్యాలయం నుంచి ఇళ్ల నంబర్లు జారీ కావడం, విద్యుత్ కనెక్షన్ ఇస్తుండడం ఆశ్చర్యం కలిగిస్తోంది. అధికారులు కనీస విచారణ చేయకుండా ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి అందినకాడికి దండుకుని అక్రమార్కులకు సహకరిస్తున్నారనే ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి. బెల్లంపల్లి మున్సిపాల్టీ 75శాతం వరకు బుధాకలాన్ శివారు సర్వేనంబరు 170లో ఉండగా.. మిగతా 25శాతం కాల్‌టెక్స్, రైల్వేస్టేషన్ ఏరియా పట్టా భూముల్లో ఉన్నాయి. అత్యధిక శాతం ప్రభుత్వ భూమి కలిగి ఉండడం అక్రమార్కులకు వరంగా మారింది. ఖాళీ జాగా కనిపిస్తే కబ్జా చేయడం పరిపాటిగా మారింది. ప్రభుత్వం 76జీవో ప్రకారం బెల్లంపల్లిలో ఇళ్లపట్టాలు జారీ చేసినప్పటి నుంచి ప్రభుత్వ, సింగరేణి లీజుభూముల ఆక్రమణ, శాశ్వత కట్టడాలకు అడ్డు లేకుండా పోతోంది.


మున్సిపల్ వ్యాప్తంగా..

మున్సిపాల్టీలో 34వార్డులు ఉన్నాయి. వీటి పరిధిలో ప్రభుత్వ, సింగరేణి లీజు భూమి, చివరికి వివాదాస్పద భూములూ కబ్జాకు గురవుతున్నాయి. గురిజాలకు వెళ్లే రహదారి పక్కన ఇందిరమ్మ కాలనీ, బెల్లంపల్లి బస్తీ, షంషీర్‌నగర్, అంబేద్కర్‌నగర్, కన్నాలబస్తీ, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, ఫుట్‌బాల్‌గ్రౌండ్ వెనుకాల, కన్నాల శివారు డబుల్ బెడ్రూం ఇళ్ల పరిసరాలు, కాల్‌టెక్స్ ఏరియా, హన్మాన్‌బస్తీ, అశోక్‌నగర్, రాంనగర్, టేకులబస్తీ, మహ్మద్‌ఖాసీం బస్తీ, కాంటా ఏరియా, బూడిదగడ్డ బస్తీ, ఏఎంసీ ఏరియా, నెంబర్–2 ఇంక్‌లైన్, సుభాష్‌నగర్, 65 డీప్ ఏరియా, రైల్వేస్టేషన్ ఏరియా, రైల్వే రడగంబాల బస్తీ, అంబేద్కర్ రడగంబాల బస్తీ, శాంతిఖనిబస్తీ, గోల్ బంగ్లా బస్తీ తదితర ప్రాంతాల్లో ఉన్న ఖాళీగా భూములు 90 శాతం వరకు పరాధీనం అయ్యాయి. మిగతా 10శాతం భూములూ కబ్జాకు అదును కోసం చూస్తున్నారు.

అధికారులకు 'మామూలే'..

కబ్జా భూముల్లో ఇళ్లు, షెడ్ల నిర్మాణాలకు నిబంధనలకు వ్యతిరేకంగా ఇంటి నంబర్లు కేటాయిస్తున్నారు. కొందరు అధికారులతో కుమ్మక్కై గంటల వ్యవధిలో ఇళ్లు, షెడ్లు నిర్మించడం, ఇంటి నంబర్లు జారీ చేయడం చకచకా జరిగిపోతున్నాయి. ఈ వ్యవహారంలో పలువురు మున్సిపల్ ప్రజాప్రతినిధుల హస్తం ఉందనే విమర్శలున్నాయి. ఇంటి నంబరు కేటాయించగానే కరెంటు కనెక్షన్ తీసుకుని చట్టబద్ధ హక్కులు పొందుతున్నారు. ఈ వ్యవహారాల్లో సంబంధిత శాఖల అధికారులు 'మామూలు'గా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వ భూముల సంరక్షణకు గత మార్చిలో రెవెన్యూ, మున్సిపల్, పంచాయతీరాజ్, పోలీసు శాఖల అధికారులు, సిబ్బందితో ఏర్పాటు చేసిన టీం నిర్జీవంగా మారి అబాసుపాలవుతోంది.

అధికారులు స్పందించడం లేదు



భూములు కబ్జా అవుతున్నా ప్రభుత్వ అధికారులు స్పందించడం లేదు. ఫిర్యాదులు చేసినా చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఇంటి నంబర్లు, కరెంట్ కనెక్షన్ల మంజూరులో వేలాది రూపాయలు చేతులు మారుతున్నాయి. ధన, అధికార బలం ఉన్న వారితోపాటు అక్రమార్కులకు అన్ని కలిసి వస్తున్నాయి. ప్రభుత్వ అధికారులు భూ కబ్జాలను నివారించాలి.
– అమానుల్లాఖాన్, మైనార్టీ నాయకుడు, బెల్లంపల్లి

కబ్జాలు అడ్డుకుంటాం



ప్రభుత్వ భూముల కబ్జాను ఏమాత్రం ఊరుకునేది లేదు. తగినంత మంది సిబ్బంది లేకపోవడంతో వేగవంతంగా భూముల కబ్జా విషయం తెలియడం లేదు. సమాచారం రాగానే వెళ్లి అడ్డుకునే చర్యలు తీసుకుంటున్నాం. కన్నాల డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల ముందు భూమి కబ్జా చేసి షెడ్డు నిర్మించిన వ్యక్తికి నోటీసు జారీ చేశాం. భూ కబ్జాలకు పాల్పడే వ్యక్తులను ఉపేక్షించం. చట్టపరంగా వ్యవహరిస్తాం.
– జ్యోత్స్న, తహసీల్దార్, బెల్లంపల్లి

కేజీబీవీలో ఖాళీ పోస్టుల భర్తీ

మంచిర్యాలఅర్బన్: జిల్లాలో కేజీబీవీల్లో ఖాళీ పోస్టులు భర్తీ చేయనున్నారు. పలువురు ఉపాధ్యాయులకు గురుకులాల్లో ఉద్యోగాలు, మరికొందరు ఇతర ఉద్యోగాల్లో చేరడంతో ఏర్పడిన ఖాళీల భర్తీకి విద్యాశాఖ నిర్ణయించింది. జిల్లాలో స్పెషల్ ఆఫీసర్లు–2, సీఆర్‌టీలు–2, పీజీసీఆర్‌టీలు 7 ఖాళీలు ఉన్నట్లు గుర్తించారు. 2023 జూలైలో నిర్వహించిన పరీక్షలో మిగిలిన అభ్యర్థులతో మెరిట్, రోస్టర్ ప్రకారం ఖాళీలు భర్తీ చేయనున్నారు. 1:3 పద్ధతిన సర్టిఫికేట్ వెరిఫికేషన్ కోసం ఈ నెల 25న ఉదయం 10.30గంటలకు జిల్లా సైన్స్ కేంద్రంలో ఒరిజినల్ సర్టిఫికెట్లు, జిరాక్స్ కాపీలతో హాజరు కావాలని డీఈవో యాదయ్య సూచించారు. అభ్యర్థుల 1:3 నిష్పత్తి జాబితా వెబ్‌సైట్, కార్యాలయ నోటీస్ బోర్డుపై ప్రదర్శిస్తామని పేర్కొన్నారు.

విద్యుత్ అధికారుల పొలంబాట

మంచిర్యాలఅగ్రికల్చర్: రైతులకు మెరుగైన విద్యుత్ సరఫరా, సమస్యల పరిష్కారానికి విద్యుత్ అధికారుల పొలంబాట కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ ఎస్.శ్రావణ్‌కుమార్ తెలిపారు. వంగిన స్తంభాలు, లూజు వైర్లు సరి చేయడం, విద్యుత్ లైన్‌లో అవసరమైన చోట సెన్సార్లు బిగించి నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడం చేస్తామని తెలిపారు. రైతులు ఆటోస్టార్టర్లు తొలగించాలని, వ్యవసాయ పంపుసెట్లకు కెపాసిటర్లు అమర్చుకోవాలని తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్లు ఫెయిలైతే వ్యవసాయదారులు వెంటనే 1912 ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని పేర్కొన్నారు.

క్లుప్తంగా

విషజ్వరంతో బాలిక మృతి


దీక్షిత (ఫైల్)

లక్సెట్టిపేట: విషజ్వరంతో బాలిక మృతి చెందింది. మున్సిపాలిటీ పరిధిలోని ఇటిక్యాల గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన దీక్షిత (12) కొన్నిరోజులుగా విషజ్వరంతో బాధపడుతుంది. కుటుంబీకులు..పట్టణంలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. రెండు రోజుల క్రితం జ్వరం ఎక్కువ కావడంతో వైద్యులు కరీంనగర్‌కు రెఫర్ చేయగా అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలించారు. చికిత్సపొందుతూ సోమవారం మృతిచెందింది. కుమార్తె మృతితో కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. కాగా, దీక్షిత.. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ఐదో తరగతి చదువుతుంది.

మెట్ల పైనుంచి పడి ఒకరు..

నేరడిగొండ: మండల కేంద్రంలో ఓ యువకుడు ఇంటి మెట్లు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు జారి కిందపడి మృతిచెందాడు. కుటుంబీకులు తెలిపిన వివరాలు.. మండల కేంద్రానికి చెందిన బోగే అశోక్ (38) వ్యవసాయ కూలీగా పనిచేస్తున్నాడు. అప్పుడప్పుడు మద్యం సేవించేవాడు. ఆదివారం రాత్రి ఇంటికి వచ్చిన తర్వాత మెట్లు ఎక్కుతుండగా పైనుంచి జారి కిందపడడంతో తలకు తీవ్ర గాయమైంది. ఆటోలో పీహెచ్‌సీకి తీసుకెళ్లగా అప్పటికే ఆయన మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బోథ్ ఆస్పత్రికి తరలించారు. తల్లి నర్సమ్మ ఫిర్యాదుతో సోమవారం కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

రైలు ఎక్కబోయి జారిపడి వ్యక్తి..

బాసర: మద్యం మత్తులో వ్యక్తి రైలు ఎక్కబోయి జారిపడి మృతిచెందాడు. బాసర రైల్వేస్టేషన్ వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. కుభీర్ మండలం సిరిపల్లికి చెందిన రావుసాబ్, సరిత దంపతులు. వీరికి ఇద్దరు పిల్లలు కృష్ణ (8), లక్కి(5). భార్యభర్తలు కూలీ పనిచేసుకుని జీవిస్తున్నారు. సోమవారం కూలీ పనికోసం మహారాష్ట్రలోని పండర్‌పూర్ వెళ్లేందుకు బాసర రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. అప్పటికే మద్యం మత్తులో ఉన్న రావుసాబ్.. పండర్‌పూర్ రైలు ఎక్కుతుండగా జారి పడి అక్కడికక్కడే మృతిచెందాడు. రైల్వే పోలీసులు ఘటనస్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని నిజామాబాద్ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యభిచార గృహంపై దాడి

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీసుస్టేషన్ పరిధిలోని బాలాజీనగర్‌లో వ్యభిచారం గృహంపై సోమవారం రాత్రి దాడి చేసినట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. ఆ కాలనీలో గల ఓ ఇంట్లో మహిళ వ్యభిచారం నడిపిస్తున్నట్లు వచ్చిన సమాచారంతో దాడి చేసినట్లు పేర్కొన్నారు. మహిళతోపాటు ముగ్గురు విటులను అరెస్టు చేసినట్లు తెలిపారు. వారివద్ద నుంచి రూ.3200 నగదు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

బడులకు నిధులొచ్చినయ్..

- తొలి విడత నిర్వహణ నిధులు మంజూరు
- ప్రత్యేకంగా క్రీడా నిధులు కూడా
- పాఠశాలల ఖాతాల్లో జమ
- హెచ్‌ఎంలకు తప్పనున్న భారం



మంచిర్యాల జెడ్పీ బాలుర పాఠశాల

మంచిర్యాలఅర్బన్: సర్కారు బడుల నిర్వహణకు సంబంధించిన తొలివిడత నిధులు మంజూరయ్యాయి. 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించిన నిర్వహణ నిధులు(స్కూల్ గ్రాంటు), స్పోర్ట్స్ గ్రాంటు నిధులు విడుదల చేస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. పాఠశాలలు పున:ప్రారంభమైన మూడు నెలలు గడిచిపోయినా పాఠశాల నిర్వహణ నిధులు రాకపోవడంతో హెచ్‌ఎంలు ఇబ్బందులు పడ్డారు. తరగతి గదిలో అవసరమైన చాక్‌పీస్, స్టేషనరీ, హాజరుపట్టిక పుస్తకాలతోపాటు ఏదైనా కొనుగోలు చేయాలంటే హెచ్‌ఎంలే సొంతంగా నిధులు వెచ్చించాల్సి వస్తోంది. ఈనేపథ్యంలో తొలివిడత నిర్వహణ 50 శాతం నిధులు పాఠశాలల ఖాతాలకు నేరుగా విడుదల కావడంతో ఊరటనిస్తోంది.

నిధులు మంజూరు ఇలా..

ప్రతిఏటా పాఠశాలలకు విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ప్రత్యేక గ్రాంట్లు మంజూరవుతాయి. 1 నుంచి 30 వరకు విద్యార్థులుంటే రూ.10 వేలు, 31 నుంచి 100 వరకు రూ.25 వేలు, 101 నుంచి 250 లోపు రూ.50 వేలు, 251 నుంచి 1000 మంది వరకు రూ.75 వేలు, వెయ్యికిపైగా ఉంటే రూ.లక్ష చొప్పున నిధులిస్తారు. ఈ నిధులతో మరుగుదొడ్ల క్లీనింగ్‌కు అవసరమైన సామగ్రి కొనుగోలు, విద్యుత్, తాగునీరు, మరమ్మతు, స్టేషనరీ, ప్రయోగ సామగ్రి, సుద్దముక్కలు వరకు ఖర్చు చేయాల్సి ఉంటుంది. జాతీయ పండుగల నిర్వహణ, కంప్యూటర్లు, ప్రాజెక్టర్ల నిర్వహణ, ఇంటర్నెట్, డిజిటల్ తరగతుల వరకు ఈ నిధులను వినియోగించుకోవాల్సి ఉంటుంది.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తొలివిడతలో 50శాతం నిధులు

జిల్లాలు	స్కూళ్ల సంఖ్య	స్కూల్‌గ్రాంటు(రూ.లు)	స్పోర్ట్స్ నిధులు(రూ.లు)	మొత్తం (రూ.లు)
ఆదిలాబాద్	1168	1,35,37,500	47,82,500	1,83,20000
మంచిర్యాల	760	85,30,000	34,45,000	1,19,75,000
నిర్మల్	762	1,00,67,500	34,75,000	1,35,42,500
ఆసిఫాబాద్	1018	1,09,07,500	38,12,500	1,47,20,000

క్రీడా నిధులు కూడా..

ప్రభుత్వ బడులకు విద్యాశాఖ ప్రత్యేకంగా క్రీడా నిధులు మంజూరు చేసింది. ప్రస్తుతానికి 50 శాతం నిధులను పాఠశాలల యాజమాన్య కమిటీలకు ఎస్సీ, ఎస్టీ, జనరల్ కాంపొనెంట్ కింద మంజూరు చేశారు. ఈ నిధులను పాఠశాలల్లో క్రీడాభివృద్ధికి వినియోగించాల్సి ఉంటుంది. పాఠశాల స్థాయిని బట్టి పరికరాలు కొనుగోలు చేయడం, పిల్లలకు నైపుణ్యాలు వివరిస్తూనే పోటీలకు సన్నద్ధం చేయడం, తదితర అవసరాలకు ఉపయోగించాలి. ఏయే పరికరాలు ఎంతెంత వెచ్చించాలనే విషయాలను అధికారులు పొందుపర్చారు.

పరికరాలు కొనుగోలు ఇలా..

ప్రాథమిక స్థాయిలో క్రీడా పరికరాల కొనుగోలుకు రూ.5 వేలు కేటాయించారు. క్రికెట్ బ్యాట్లు, స్టంప్స్, చిన్న సైజు సాఫ్ట్‌బాల్, టెన్నిస్ బాల్, ప్లాస్టిక్ బాల్స్, ఫుట్‌బాల్స్, బాస్కెట్ బాల్స్, రబ్బీ సాఫ్ట్ బాల్ పలు క్రీడా పరికరాలు కొనుగోలు చేయాలి. ప్రాథమికోన్నత పాఠశాలల్లో రూ.10 వేలు, ఉన్నత పాఠశాలల క్రీడలకు రూ.25 వేలు చొప్పున కేటాయించారు. రబ్బర్ షాట్‌పుట్లు, స్కిప్పింగ్, రోప్, క్రికెట్ బ్యాట్లు, టెన్నిస్ బాల్, నెట్, హ్యాండ్ బాల్, త్రోబాల్, బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్, పెద్ద గోల్ఫ్ కోర్స్, ప్రాథమిక చికిత్స పెట్టె, సాసర్ కోన్, నిచ్చెన, ఇతర క్రీడా పరికరాలు కొనుగోలు చేయాలి.

హాస్టల్ నుంచి పారిపోయిన విద్యార్థి

- జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాలలో ఘటన
- సమాచారంతో పట్టుకున్న బ్లూకోల్ట్స్ పోలీసులు


విద్యార్థిని హాస్టల్ సిబ్బందికి అప్పగిస్తున్న పోలీసులు

ఖానాపూర్: హాస్టల్ నుంచి విద్యార్థి పారిపోయిన ఘటన పట్టణంలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాలలో చోటుచేసుకుంది. ఎస్సై రాహుల్ కథనం ప్రకారం.. కడెం మండలం కొండుకూరు గ్రామానికి చెందిన నిక్షిత్ 5వ తరగతి చదువుతున్నాడు. అతనికి చదువుకోవడం ఇష్టం లేకపోవడం, ఇంటిపై బెంగతో ఆదివారం రాత్రి హాస్టల్ నుంచి పారిపోయాడు. పరిసరాల్లో తిరుగుతున్న విద్యార్థిని ఓ వ్యక్తి గమనించి డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం అందించాడు. బ్లూకోల్ట్స్ పోలీసులు సంతోశ్, సుధీర్ అక్కడికి వెళ్లి విద్యార్థిని పట్టుకుని తిరిగి హాస్టల్ సిబ్బందికి అప్పగించారు.

మహిళల్లో చైతన్యం కోసమే ఇందిరా ఫెలోషిప్



అవగాహన కల్పిస్తున్న ఆత్రం సుగుణ

ఆదిలాబాద్‌రూరల్: మహిళల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు ఇందిరా ఫెలోషిప్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు కాంగ్రెస్ ఆదిలాబాద్ పార్లమెంట్ నాయకురాలు, ఇందిరా ఫెలోషిప్ ఉమ్మడి జిల్లా యూనిట్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణ అన్నారు. మావల మండల కేంద్రంలో ఫెలోషిప్ సభ్యులకు సోమవారం బూట్ క్యాంప్ వర్క్‌షాప్ నిర్వహించారు. రాజకీయాల్లో మహిళల పాత్ర, వారు ఎదుర్కొంటున్న సవాళ్లు, భవిష్యత్తు అవకాశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శక్తి అభియాన్‌లో భాగంగా ఉమెన్ ఎంపవరింగ్, ట్రాన్స్‌ఫార్మింగ్ పాలిటిక్స్ అనే లక్ష్యంతో ఇందిరా ఫెలోషిప్ సంస్థను రాహుల్‌గాంధీ ఆలోచనతో వివిధ రాష్ట్రాల్లో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అన్నివర్గాల మహిళలను ఎంపిక చేసుకుని వారికి ఇందిరా ఫెలోషిప్ పేరిట ఆర్థిక సహకారం అందిస్తామన్నారు.తెలంగాణ కోఆర్డినేట్ శివలాల్ నేతికల్, కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు నగేశ్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు చరణ్ గౌడ్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న అధికారులు

ఉట్నూర్‌రూరల్: హైదరాబాద్‌లో ఈనెల 19, 20 తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ మీట్‌లో ఉట్నూర్, జాతర్ల క్రీడా పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు ప్రతిభకనబర్చారు. అండర్-14 విభాగంలో అథ్లెటిక్స్‌లో రాథోడ్ కార్తీక్‌కు (బంగారు), హెరకుమ్ర నగేశ్‌కు (కాంస్య), అండర్ 14–లో కిడ్స్ జావెలిన్ త్రోలో కోట్నాక్ జాకేశ్‌కు (కాంస్య), 60 మీ.ల పరుగులో రాథోడ్ విక్రమ్‌కు (కాంస్య), అండర్–16లో జావెలిన్‌త్రోలో పెందూర్ సతీశ్‌కుమార్ (కాంస్య) పతకాలు దక్కించుకున్నారు. వారితోపాటు కోచ్ జి.సునంద్‌లను ఏసీఎంవో అర్క జగన్, జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారధి అభినందించారు. కార్యక్రమంలో పీడీ జాదవ్‌మేమంత్, కోచ్ శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

అర్జీలు సత్వరం పరిష్కరించాలి

- ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా


అర్జీలు స్వీకరిస్తున్న ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్: గిరిజనుల అర్జీలు సత్వరం పరిష్కరించాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా పేర్కొన్నారు. ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి లో గిరిజనుల నుంచి ఆమె అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ అర్జీలను సంబంధిత అధికారులు పరిశీలించి అర్హులకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో వసంత్‌రావు, ఏడీ ఎంఅండ్‌వో కుడిమెత మనోహర్, ఏవో దామోదర్, పీహెచ్‌వో సందీప్‌కుమార్, జేడీఎం నాగభూషణం, పెసా కోఆర్డినేటర్ సవంత్‌రావు, డీపీవో ప్రవీణ్, మేనేజర్ లింగు, సిబ్బంది పాల్గొన్నారు.

- తన పైచదువుల కోసం ఆర్థికసాయం అందించాలని ఉట్నూర్ మండలం బీర్సాయిపేటకు చెందిన వైష్ణవి అర్జీ అందించింది.
- తనకు ఉద్యోగం ఇప్పించాలని ఇంద్రవెల్లి మండలంవడ్గాం గ్రామానికి చెందిన సునీత వేడుకుంది.
- ఉట్నూర్ మండలం మారుతీగూడకు మినీ అంగన్‌వాడీ మంజూరు చేయాలని జంగుబాయి విన్నవించింది.
- తన పంట భూమికి పట్టా ఇప్పించాలని ఇంద్రవెల్లి మండలం దుబ్బగూడకు చెందిన కోవ హన్మంత్‌రావు అర్జీ అందించాడు.

'ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ విద్రోహులను నిలదీయండి'

మంచిర్యాలరూరల్(హాజీపూర్): సింగరేణి గనులు, డిపార్ట్‌మెంట్ల వద్దకు వచ్చే ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ విద్రోహులను నిలదీయడమే కాకుండా తరిమికొట్టాలని భారత కమ్యూనిస్టు పార్టీ(మావోయిస్టు) సింగరేణి కోల్‌బెల్ట్ కమిటీ కార్యదర్శి ప్రభాత్ సోమవారం పత్రికలకు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. లాభాల వాటా పంపకంలో పెరిగిన ఒక్క శాతంపై ఇది తమ ఘనత అంటూ కార్మికులను మోసగించే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. కాంట్రాక్ట్ కార్మికులకు లాభాల వాటా 20శాతం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక


డి.ప్రేమ్‌దీప్

రెబ్బెన(ఆసిఫాబాద్): మండలంలోని గోలేటి టౌన్‌షిప్‌కు చెందిన డి.ప్రేమ్‌దీప్ జాతీయ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైనట్లు అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నారాయణరెడ్డి తెలిపారు. హర్యానా రాష్ట్రం రోతక్ జిల్లాలో ఈనెల 25 నుంచి 29 వరకు జరగబోయే 43వ సబ్ జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో ఉమ్మడి జిల్లా జట్టు నుంచి ప్రేమ్‌దీప్ పాల్గొంటారని వివరించారు. అసోసియేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎస్.తిరుపతి, ఏరియా జీఎం శ్రీనివాస్, పాఠశాల కరస్పాండెంట్ రెడ్డిమల్ల తిరుపతి, జిల్లా అధ్యక్షుడు నరసింగం తదితరులు ఈ సందర్భంగా ప్రేమ్‌దీప్‌ను అభినందించారు. సింగరేణి ఉన్నత పాఠశాలకు చెందిన ఈయన జాతీయ పోటీల్లో సత్తాచాటాలని పలువురు ఆకాంక్షించారు.

మున్నూరు కాపు సంఘం జిల్లా ఇన్‌చార్జిగా లక్ష్మణ్


లక్ష్మణ్

జన్నారం: మున్నూరు కాపు సంఘం నిర్మల్ జిల్లా ఇన్‌చార్జిగా జన్నారం మండలం బాదంపల్లి గ్రామానికి చెందిన కాసెట్టి లక్ష్మణ్ నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం అపెక్స్ కౌన్సిల్ రాష్ట్ర కన్వీనర్ పురుషోత్తంరావు సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. జన్నారం మండల మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడిగా కొనసాగుతున్న లక్ష్మణ్ సేవలు గుర్తించి ఈ పదవి అప్పగించారు. తనకు బాధ్యతలు అప్పగించిన నాయకులకు ఈ సందర్భంగా లక్ష్మణ్ కృతజ్ఞతలు తెలిపారు.

రేపు ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీలు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాకేంద్రంలోని గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాలలో హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు డీఎస్‌వో మీనారెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. సీనియర్ విభాగంలో పురుషులు, మహిళలకు ఎంపిక పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు తమ ఆధార్ కార్డు, పాస్‌ఫొటోతో రావాలని సూచించారు. కోచ్ అరవింద్‌కు రిపోర్టు చేయాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు సెల్ 9866395859, 9550909870 నంబర్లలో సంప్రదించాలన్నారు.

కట్నం వేధింపులకు వివాహిత బలి


లహరి మృతదేహం

జైపూర్: అదనపు వరకట్నం వేధింపులకు వివాహిత బలైంది. మండలంలోని ఇందారం గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఎస్సై శ్రీధర్ కథనం ప్రకారం.. ఇందారం గ్రామానికి చెందిన రమేశ్‌తో నస్పూర్‌కు చెందిన ఇండ్ల లహరి (21)కి 2021లో వివాహమైంది. వీరికి 18 నెలల పాప ఉంది. పెళ్లయిన కొంతకాలానికి భర్త రమేశ్, అత్తారింటివారు కట్నం కోసం ఆమెను వేధించసాగారు. పెళ్లిలో తక్కువ కట్నం ఇచ్చారని అదనంగా మరో రూ.2 లక్షలు తీసుకురావాలని శారీరకంగా, మానసికంగా చిత్రహింసలకు గురిచేశారు. వేధింపులు భరించలేక లహరి సోమవారం ఇందారంలోని ఇంట్లో ఉరేసుకుంది. మృతురాలి తల్లి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చెరువులో దూకి విద్యార్థి ఆత్మహత్య

నిర్మల్‌రూరల్: చదువుకోవడం ఇష్టం లేక విద్యార్థి చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రూరల్ పోలీసుల కథనం ప్రకారం..మండలంలోని వెంగ్వాపేటకు చెందిన సాద అభి (17) నిజామాబాద్‌లో ఇంటర్మీడియెట్ చదువుతున్నాడు. గత 15 రోజుల క్రితం బంధువుల అంత్యక్రియలకు వచ్చి ఇంట్లోనే ఉంటున్నాడు. రెండు, మూడుసార్లు కళాశాలకు వెళ్లమని కుటుంబ సభ్యులు చెప్పినా అభి వినలేదు. సోమవారం తల్లిదండ్రులు మందలించడంతో మనస్తాపం చెందిన అభి.. గ్రామంలోని చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నటున్ల పోలీసులు తెలిపారు.

పురుగుల మందు తాగి ఒకరు..

బేల: మండలంలోని జూనోని గ్రామానికి చెందిన గుర్నులే మధుకర్ (35) సోమవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై రాధిక తెలిపారు. ఆమె కథనం ప్రకారం.. మధుకర్ గత రెండేళ్లుగా మద్యానికి బానిసయ్యాడు. ఈక్రమంలో సోమవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య రేణుక ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

అటవీ భూములు సాగుచేసిన ఐదుగురి రిమాండ్


రిమాండ్‌కు తరలిస్తున్న వారితో అధికారులు

చింతలమానెపల్లి: మండలంలోని దిందా శివారులో అటవీభూములు సాగు చేస్తున్న ఐదుగురిని అటవీ అధికారులు సోమవారం రిమాండ్‌కు తరలించారు. సెక్షన్ అధికారి మోహన్ కథనం ప్రకారం.. ఖర్జెల్లి రేంజ్ పరిధిలోని బందెపల్లి బీట్‌లో దిందా గ్రామానికి చెందిన నికాడె సుశీల, డోకె మాంతయ్య, మడె నారాయణ, ధన్నూరి రాజేశ్, దంద్రె శేఖర్‌లు అటవీ భూమి సాగు చేశారు. 178, 179 కంపార్ట్‌మెంట్లలో 7 ఎకరాల భూమిలో చెట్లు నరికి, అటవీ భూమిని ఆక్రమించుకుని కంచెలు వేసుకున్నారు. సమాచారం అందడంతో అధికారులు.. ఐదుగురిని అదుపులో తీసుకుని కేసు నమోదు చేశారు. వీరిని సిర్పూర్(టి) సివిల్ కోర్టులో హాజరుపర్చగా జడ్జి..15 రోజుల రిమాండ్ విధించారని సెక్షన్ అధికారి తెలిపారు.

హెచ్‌ఎంఎస్ ఆధ్వర్యంలో బ్లాక్ డే


కోడ్ పత్రాలను దహనం చేస్తున్న నాయకులు

కాసిపేట: మందమర్రి ఏరియా కాసిపేట గనిపై సోమవారం హెచ్‌ఎంఎస్ ఆధ్వర్యంలో బ్లాక్ డే నిర్వహించారు. ఇందులో భాగంగా నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపి కార్మిక కోడ్ పత్రాలను దహనం చేశారు. హెచ్‌ఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు జె.శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 44 చట్టాలను 4 కోడ్‌లుగా మార్చడాన్ని అన్ని కార్మిక సంఘాలు వ్యతిరేకిస్తున్నాయన్నారు. కేంద్రం కార్మికుల హక్కులు హరించడాన్ని తీవ్రంగా పరిగణిస్తూ బ్లాక్ డేగా నిరసన చేపట్టామని తెలిపారు. లాభాల వాటాలో నికర లాభంపై 33 శాతం ఇవ్వాల్సి ఉండగా, సంస్థ అభివృద్ధికి రూ.2200 కోట్లు తీసుకుని రూ.2490 కోట్లలో వాటా ప్రకటించడం కార్మికులను మోసం చేయడమేనన్నారు. సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ పార్వతి రాజిరెడ్డి, డెప్యూటీ జనరల్ సెక్రెటరీ సుదర్శన్, నాయకులు ఎర్ర శ్రీనివాస్‌రెడ్డి, చొప్పరి రామస్వామి, థామస్, ప్రభాకర్, ప్రదీప్ తదితరులు ఉన్నారు.

'లాభాలపై తప్పుడు ప్రచారం'


మాట్లాడుతున్న ముస్కే సమ్మయ్య

శ్రీరాంపూర్: సింగరేణి సంస్థ సాధించిన లాభాలు, వాటాపై కొన్ని సంఘాల నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ డెప్యూటీ ప్రధాన కార్యదర్శి ముస్కే సమ్మయ్య మండిపడ్డారు. శ్రీరాంపూర్ సీహెచ్‌పీలో సోమవారం గేట్ మీటింగ్ నిర్వహించి కార్మికులతో ఆయన మాట్లాడారు. ప్రతి సంవత్సరం సంస్థ సాధించిన లాభాల నుంచి ఏ విధంగా వాటా చెల్లిస్తున్నారో ఈసారి కూడా అదేవిధంగా చెల్లించనున్నారన్నారు. నికర లాభం మీదనే ప్రతిసారి కార్మికులకు వాటా పంపిణీ చేస్తారని తెలిపారు. గడిచిన రెండు పర్యాయాలు గుర్తింపు సంఘంగా ఉన్న టీబీజీకేఎస్ నాయకులకు అవగాహన ఉండి కూడా ఇలా మాట్లాడడం సరికాదన్నారు. ఈసారి తాము అదనంగా ఒక శాతం పెంచి ఇప్పిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ ఏరియా కార్యదర్శి ప్రసాద్‌రెడ్డి, పిట్ సెక్రెటరీ గురిగంటే నర్సింగరావు, చల్ల తిరుపతి, సాయిరాజ్ నాయకులు శ్రీనివాస్, నారాయణ, రాజేందర్, అశోక్‌రెడ్డి, ఈశ్వర్ లచ్చన్న పాల్గొన్నారు.

ఎస్టీపీపీ కార్మికులకు లాభాల వాటా చెల్లించాలి


ఈడీ రాజశేఖర్‌రావుకు వినతిపత్రం ఇస్తున్న హెచ్‌ఎంఎస్ నాయకులు

జైపూర్: ఎస్టీపీపీలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు లాభాల వాటాగా ప్రతి కార్మికుడికి రూ.10 వేలు చెల్లించాలని హెచ్‌ఎంఎస్ నాయకులు డిమాండ్ చేశారు. హెచ్‌ఎంఎస్ యూనియన్ వైస్ ప్రెసిడెంట్ చిప్పకుర్తి సంపత్, సాయికృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఎస్టీపీపీ ఈడీ రాజశేఖర్‌రావుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఏటా సింగరేణి సంస్థ సాధించే లాభాల్లో ఎస్టీపీపీ నుంచి వేల కోట్ల లాభాలు ఆర్జిస్తుందని నిరంతరం విద్యుత్ ఉత్పత్తికి కష్టపడుతున్న కార్మికులకు బోనస్ చెల్లించాలని కోరగా ఆయన ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు.

తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతు ఆత్మహత్యాయత్నం

కౌటాల: మండలంలోని గుండాయిపేటకు చెందిన రైతు మండొగాడే పత్రు తన భార్యతో కలిసి పురుగుల మందు డబ్బాతో తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ఆత్మహత్యకు యత్నించాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. గుండాయిపేటకు చెందిన మండొగాడే పత్రు, ఎల్ములే బాబురావులకు ఐదెకరాల భూమి సంబంధించి గత కొంతకాలంగా వివాదం నడుస్తుంది. ఇటీవల బాబురావు ఐదెకరాల్లో పత్తి సాగు చేయగా.. ఈ భూమి తనదనని మండొగాడే పత్రు.. పత్తి పంటపై గడ్డి మందుతో పిచికారీ చేశాడు. పంటకు నష్టం జరిగిందని బాబురావు తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశాడు. రెవెన్యూ అధికారులు ఇటీవల పంటను పరిశీలించారు. బాబురావు సాగుచేస్తున్న భూమి తనదేనని, తనకు అధికారులు న్యాయం చేయాలని కోరుతూ సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట పత్రు పురుగుల మందు డబ్బాతో ఆత్మహత్యకు యత్నించగా పోలీసులు అదుపులో తీసుకుని స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనపై విచారణ చేపడుతామని తహసీల్దార్ పుష్పలత తెలిపారు.

బెదిరింపులకు పాల్పడుతున్న విలేకరి అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న సీఐ రవీందర్

చెన్నూర్: అమాయక ప్రజలను బెదిరించి వసూళ్లకు పాల్పడుతున్న పట్టణానికి చెందిన విలేకరి కనుకుంట్ల వెంకట్రాజ్ అరెస్టు చేసినట్లు సీఐ రవీందర్ తెలిపారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో సోమవారం ఈ మేరకు వివరాలు వెల్లడించారు. ఎన్‌జీవో కాలనీకి చెందిన గంగిరెడ్డి రాజేశంను వెంకట్రాజ్ రూ.50 వేలు డిమాండ్ చేయగా రూ.5 వేలు ఫోన్ పే చేశాడు. ఇంకా డబ్బులు కావాలని వేధించాడు. బొమ్మ శ్రీనివాస్‌రెడ్డి తన సొంత భూమిలో మొరం తవ్వుతుండగా రూ.25 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. నాయిని తిరుపతి పండ్ల వ్యాపారి షెడ్డు నిర్మిస్తుండగా అక్రమంగా వేస్తున్నారని బెదిరించి రూ.50 వేలు డిమాండ్ చేయగా రూ. 31 వేలు ఇచ్చాడు. గుర్రం సుధాకర్ చికెన్ సెంటర్ నిర్మిస్తుండగా అతని నుంచి రూ.5 వేలు వసూలు చేశాడు. విలేకరి ముసుగులో ప్రజలను భయపెడుతూ డబ్బులు వసూలు చేస్తున్నాడని సదరు యాజమానుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి వెంకట్రాజ్‌ను రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. సమావేశంలో ఎస్సై తదితరులు పాల్గొన్నారు.